# శ్రీసన్నిధానం

రామానుజార్య దివ్యాజ్ఞా వర్ధతాం । అభివర్ధతామ్।

మార్చి 2022



# శ్రీసన్నిధానం

srisannidhanam.org

## ఇందులో


3. తెలంగాణా తిరుపతి యాదాద్రి

6. రామానుజ సుధామాధురి

వసుదైక కుటుంబకం

7. సమతామూర్తి ఆవిష్కరణకై ఆర్థిక సమీకరణలు

8. వందే గురుపరంపరాం

9. భయంలేని జీవితం గడిపే మార్గం

10. కల్యాణం రమణీయం

11. ఆకలి తీర్చిన పుణ్యం

12. శ్రీసన్నిధి పదకేళి



**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి — చీఫ్ ఎడిటర్

సముద్రాల శారద — వొపీనియన్ ఎడిటర్

డింగరి శ్రీనివాసమూర్తి — మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

శ్రీమాన్ అమరవాది వెంకటనర్సింహా చార్యులు




## ముఖచిత్ర పరిచయం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. పదకొండు రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం బాలాలయంలో చివరిసారిగా స్వామి వారికి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించారు. ప్రధాన ఆలయంలో నరసింహస్వామి ఉద్ఘాటన ముహూర్తం ఖరారు అయిన నేపథ్యంలో ఈ సంవత్సరం జరుగుతున్న ఉత్సవాలకు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకవైపు బ్రహ్మోత్సవాలు మరోవైపు 21 జరుగనున్న ఉత్సవాల ఏర్పాట్లు భారీగా జరుగుతుండడంతో మంత్రులు అధికార యంత్రాంగం యాదగిరి గుట్టలో బసచేసి ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తున్నారు. నగరం నుంచి భక్తులు ప్రతినిత్యం ఉత్సవాలలో పాల్గొనడానికి తరలివస్తున్నారు. ముఖ్యంగా పాత నర్సింహ స్వామి ఆలయాన్ని సందర్శించడానికి భక్తులు తరలివస్తున్నారు.


PUBLISHED BY :

డింగరి శ్రీనివాసమూర్తి

మేనేజింగ్ ఎడిటర్




చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001 ఫోన్ : 0878 2933323; 9 502583323;

# తెలంగాణా తిరుపతి యాదాద్రి

## మార్చి 28 ఉదయం 11.55 గంటలకు భక్తులకు పునరంకితం



పండుగైనా పబ్బమైనా గుట్టకు వెళ్లడం శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామిని దర్శించడం కొబ్బెరి బెల్లాలివిగో నర్సయ్య అని మొక్కులు చెల్లించడం తెలంగాణా ప్రజల అలవాటు. ముఖ్యంగా జంటనగర వాసులు శనివారం, ఆధివారం శ్రీనృసింహుని కొలువులో అంటూ పులోమని యాదగిరి గుట్టకు నగరంనుంచి పయనమయ్యేవారు. తెలంగాణా ఏర్పడ్డాక. తిరుపతిలాంటి కలియుగవైకుంఠాన్ని నిర్మించాలన్న సంకల్పం ముఖ్యమంత్రి కె.సి.ఆర్‌కు కలిగింది. ఆలోచన వచ్చిందే తడవుగా యాదగిరిగుట్టను తీర్చిదిద్దేపనిలో పడ్డారు. ఈ ఆలోచన ఆ నృసింహుడే కల్పించాడన్నట్లుగా పనులు చకచకా జరిగాయి. ఆలయ నిర్మాణం చేపట్టారు. మాడవీధులు, రాజగోపురాలు, ప్రాకారాలు ఇత్యాది హంగుల నిర్మాణం చేపట్టారు. నాటా నుండి కునుకులేకుండా పనులు చేయిస్తూనే ఉన్నారు. పనులకోసం నిధులు కేటాయిస్తున్నారు, అధికారులను పురమాయిస్తున్నారు. ఆలయాల నిర్మాణాలలో నిష్ణాతులైన స్థపతుల రప్పించారు. వివిధ రాష్ట్రాలలోని శిల్పులను రప్పించారు. కలియుగ వైకుంఠంలా తీర్చిదిద్దారు. వైభవాన్ని కల్పించడానికి అహర్నిషలు కృషిచేశారు. ఆలోచన వచ్చిన తడవుగా అధికార యంత్రాంగంతొ తరలి వెళ్లి పనులను పురమాయించారు. దివ్యవిమానానికి బంగారు తాపడం చేసేపనిని చేపట్టారు. ఇందుకోసం అవసరం అయిన బంగారాన్ని భక్తుల నుంచి విరాళాల రూపంలో సేకరించారు. అనుకున్న దానికంటే ఎక్కువగా సేకరించి స్వామివారి రథానికి బంగారి రేకును వేయించేపనిని పురమాయించారు. ఈవైభోగాన్ని చూసిన నరిసింహస్వామి వైకుంఠం వచ్చి కొలువైనాడని భావించి, పరవశించిన వెంటనే ఇది ఇలవైకుంఠము ఇదియే యాదాద్రి అని భక్తజనులు కీర్తింస్తారు. ఆలయంలో ప్రవేశించడానికి ద్వజస్తంభం వద్దనుంచే భక్తిపారవశ్యం ఉట్టిపడే నిర్మాణాలు కనిపిస్తాయి. ప్రహ్లాద చరితం, ఆలయ కాంప్లెక్స్ వద్ద జీవ ఉట్టిపడే శిల్పాలు. హనుమంతుడి విగ్రహం , అక్కడ ఉన్న తంజావూరు చిత్రాలు, పల్లకీ మరియు అద్దాల మండపం మొదలగు వాని వైభవం చెప్పనలవి కాదు చూసి తరించాల్సిందే.



# తెలంగాణా తిరుపతి యాదాద్రి



ఇల వైకుంఠము ఇదిగో అదియే యాదాద్రి. శ్రీలక్ష్మీనృసింహక్షేత్రం అద్భుత నిర్మాణాలతో నూతన హంగులతో, తెలంగాణా తిరుపతిగా వాసికెక్కేలా యాదాద్రిలో ఘనంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఒక్కోనిర్మాణానికి దేశంలోని వివిధ ప్రాంతాల శిల్పులు విచ్చేసి నిర్మించిన తీరు అద్భుతం, రమణీయం కమనీయం యాదగిరీశుని స్వయంభూ ధర్శనానికి ఒకవైపు ఏర్పాట్లు జరుతున్నాయి. మరోవైపు వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. అయితే మార్చి 28 మహా కుంభప్రోక్షణ ఏర్పాట్లు ఉంటుందా అన్న సందేహానికి తావులేకుండా 11 కోట్ల లక్ష్మీనృసింహ మూల మంత్ర జపం కొన్నినెలలుగా జరుతున్నాయి. ఆలయ విమాన గోపురానికి బంగారు తాపడం కార్యక్రమం మరోవైపు పూర్తికావచ్చింది. సుమారు 60 కిలోల బంగారం ఇందుకోసం అవసరం అవుతుందని అంచనా వేశారు. అనుకున్న అంచనాకు మించి బంగారాన్ని భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. ఎట్టకేలకు అనుకున్న ముహూర్తానికి మహాకుంభ సంప్రోక్షణ జరుగుతుందని అధికారులు, ఆలయ ప్రధానార్చకులు ప్రకటించేశారు.

శ్రీలక్ష్మీనృసింహస్వామివారి బాలాలయంలోని యాగశాలలో పంచకుండాత్మక మహాయాగం వైభవంగా నిర్వహిస్తారు ఇందులో భాగంగా వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, మహాలక్ష్మి యజ్ఞకుండాలతో స్వాహాకారం జరుగుతుంది. ఇది అద్భుతమైన కార్యక్రమం పాంచరాత్రాగమ, శ్రీరామానుజుల వారు అందించిన ఆగమ పద్దతిలో నిర్వహిస్తారు. బింబం, కుంభం, చక్రాబ్ది మండలం, అగ్ని యందు స్వామివారిని తొలుత ఆవాహనంచేసి చతుస్థానార్చన కార్యక్రమం చేపడుతారు. దీనివల్ల రాష్ట్ర శ్రేయస్సుతో పాటు ప్రపంచ దేశాల శ్రేయస్సు కూడా చేకూరుతుంది. ప్రపంచ దేశాలన్నీ శాంతియుతంగా ఉండాలని, ప్రస్తుతం నెలకొన్న యుద్ధ మేఘాలు శ్రీనృసింహస్వామి చలువతో తొలగిపోయేలా ఈ యజ్ఞం ద్వారా సిద్దిస్తుంది.

ఇందులో భాగంగానే పంచకుండాత్మక మహాయాగంతో సంప్రోక్షణ చేపట్టనున్నట్టు ఆలయ ప్రధానార్చకుడు నల్లన్థీఘళ్ లక్ష్మి నరసింహాచార్యులు తెలిపారు. ఇందులో భాగంగా 21న ఉదయం సంప్రోక్షణ స్నపన కార్యక్రమం చేపట్టడానికి వీలుగా అంకురార్పణ చేస్తారు. 22న ఉదయం అగ్నిమథనంతో హెూమ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ప్రతిరోజూ మూల మంత్ర మూర్తిమంత్ర జపాలు, మహాలక్ష్మి మంత్రం, క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామి మంత్రం, ధ్వజస్తంభానికి గరుడ మహామంత్రం వంటి జపాలు, హవనాలు నిర్వహించడానికి ఋత్విక్ సమీకరణ జరిగింది.

సుమారు మూడున్నర సంవత్సరాలనుంచి 108 మంది ఋత్విక్కులతో మూలమంత్ర జపం నిర్వహిస్తున్నారు. శ్రీలక్ష్మీనృసింహస్వామిని ప్రసన్నం చేసుకోడానికి భక్తుల అభీష్టం నెరవేర్చేవిధంగా మూలస్వామి పున:ప్రతిష్ఠామహెూత్సవానికి వీలుగా 11 కోట్ల లక్ష్మీనృసింహ మూల మంత్ర జపం చేయాలని



ఆలయ అంతర్భాగం

లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు **8** కోట్ల జపం పూర్తిచేశారు. అనుకున్న లక్ష్యానికి చేరుకోడానికి వీలుగా **108** మంది రుత్విక్కులతో జపం నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు. దీనివల్ల మూలమూర్తి స్థాపిత యంత్రాలకు బలం చేకూరుతుంది.

మూలమూర్తులకు పూర్వవైభవం సిద్ధించేలా ప్రతష్ఠామహెత్సవాల సందర్భంలో నిర్వహించే క్రతువులను శాస్త్రబద్ధంగా నిర్వహిస్తారు. జలాదివాసం, ధాన్యాధివాసం ఇత్యాది ఆవాసాలు చేపట్టడానికి తగు ఏర్పాట్లు చేశారు. **21** నుంచి **28**వరకు మొదటిరోజు నవ కలశ అభిషేకాలు ప్రారంభిస్తారు. ఆతర్వాత వరుసగా నిర్వహించే అభిషేకాలలో కలశాల సంఖ్య ఆగమ పద్ధతిలో పెంచుతారు. ఇలా వరుసగా **16** కలశాలతో, **25** కలశాలతో, **108** కలశాలతో, **81** కలశాలతో, **1000** కలశాలతో అభిషేకాలు నిర్వహిస్తామని ప్రధానార్చకులు వెల్లడించారు. ప్రతిష్ఠ చేయాల్సిన విగ్రహాలకు ఉత్తమ, మధ్యమ, అధమ, ఉత్తమోత్తమాది స్నపనాలు నిర్వహిస్తామని ఇందులో భాగంగానే ధాన్యాదివాసం, జలాదివాసం, శయాదివాసం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు వెల్లడించారు. స్వామివారిని పంచామృతాలలో, పుష్పాలు, ఫలాల్లో కూడా ఉంచుతారు. పాంచరాత్రాగమశాస్త్రం, భగవద్ రామానుజ సంప్రదాయం ప్రకారం విశిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ప్రధానాలయ పునఃప్రారంభంలో భాగంగా మార్చి **28**న స్వామివారి దివ్య విమాన శిఖరానికి కుంభ సంప్రోక్షణాభిషేకం నిర్వహించనున్నారు. **28** ఉదయం **11.55** గంటలకు మిథునలగ్న సుముహూర్తాన యాదాద్రి దేవస్థానాన్ని భక్తులకు, ప్రజలకు ముఖ్యమంత్రి కేసీఆర్ పునరంకితం చేస్తారు. యజ్ఞశాలలో ప్రధాన వేదికలో మహామూర్తి కుంభస్థాపన, సప్తగోపురాలకు ప్రత్యేక మహాకుంభాభిషేకానికి కుంభస్థాపనలు, ప్రధాన కుంభం బంగారు కలశాలను సిద్ధంచేశారు. ప్రధాన కుంభంలో లక్ష్మీనరసింహస్వామిని ఆవాహనం చేస్తారు ఒక్కో గాలి గోపురంలోన కుంభంలో దేవతలను ఆవాహనం చేస్తాం. దివ్య విమానానికి మహాసుదర్శన ఆవాహనం, సప్త రాజగోపురాలకు అధిష్ఠాన దేవతల ఆవాహనం కార్యక్రమం వైభవంగా నిర్వహించడానికి తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు, అధికారులు వెల్లడించారు.



ఆలయ అంతర్భాగం

# వసుధైక కుటుంబకం

మండే సూర్యుడు జీవ కిరణ మాధురీతో జగతి జీవరాశులు అన్నింటినీ చైతన్యవంతం చేస్తాడు. అపౌరుషేయం అయిన వేద వాంగ్మయం కూడా సమస్త జగత్తును పరిరక్షిస్తుంది. ఆ వేదసార మగు సూక్తులతో ఆచార్యుడు అందరి జీవన గతిని సంస్కరిస్తాడు .. ఎవరు ఏ మార్గంలో భగవంతుని పొందినా, ఎవరు ఏ రూపంలో పూజించినా, భగవత్ తత్వాన్ని వ్యాఖ్యానించినా అది వారి దృక్ పరిమితికి అందినంత మాత్రమే అవుతుంది. కానీ వైదిక సారభూతమైన భగవత్ నిరూపణము మాత్రమే సంపూర్ణమైనది. భగవత్ శరీరంగా భావింప బడు సమస్త జగత్తును రక్షించేది వైదిక ధర్మం. అట్లే వర్ణ ఆశ్రమ కుల సంప్రదాయ ధర్మాచరణలు ఎన్నోఉన్నాయి. వేదోపబృంహణాలుగానే స్మృతి ,శాస్త్ర పురాణాలు మనకు ధర్మాన్ని తెలియ జేస్తాయి .అయినా భగవంతుణ్ని జాతి కుల బేధం లేకుండా ప్రపత్తి మార్గంలో సేవించవచ్చు . భగవంతుని పొందడంలో అందరూ యోగ్యులే! ఇది ప్రబోధించే మార్గమే మన రామానుజ దర్శనం “వసుధైక కుటుంబకం” అనే విశ్వజనీనమైన భావనను బలపరిచే సిద్ధాంతం జగదా చార్యుల ఆచరణా సుపథం! భగవద్ రామానుజాచార్య జీవన గతిలో ఒడిదుడుకులను సరిచేసుకొని సమాజాన్ని ఉజ్జీవింప చేసిన తీరు చాలా గొప్పది.”ఉదార చరితానాంతు వసుధైవ కుటుంబకం” అన్నట్లుగా వారి ఔదార్యం సాటిలేనిది. సమాజ ధర్మాలు నశిస్తున్న రోజుల్లో, వేదార్థాలకు కుదృష్టి సోకిన రోజుల్లో అవతరించారు జగదాచార్యులు. ఆ చీకట్లను చీల్చుతూ ఉదయించిన జ్ఞాన సూర్యుడు రామానుజ దివాకరుడు. ఆ సమయంలో వారు లేకపోతే ఎలా ఉండేదో మన పెద్దలు ఇలా స్తుతిస్తారు

” నా చేత్ రామానుజే త్యేషా చతురా చతురక్షరీ

కామావస్థాం ప్రపద్యంతే జంతవో హంత మాదృషాః “అనగా “రామానుజ “అను ఈ సులభ మయిన నాలుగక్షరాలే లేకపోతే ఎలాంటి అజ్ఞానపు స్థితిని పొంది ఉం డే వారిమో కదా “అని భావం మృత విపత్తులు దరి చేరే సమయంలో సామాజిక ధర్మాలను తిరిగి ఉజ్జీవింప చేశాయి శ్రీ రామానుజ సూక్తి సుధలు. జగదా చార్యులు ఉపదేశించిన ఈ జీవన విధిలో ఆధిపత్యాల ఆక్షేపణ విధానాలే ఉన్నాయి. అందరినీ ఉద్ధరించే ఆచరణలే ఉన్నాయి. అందరికీ దేవాలయ ప్రవేశాలను ఆదేశించారు. దేవాలయ వ్యవస్థను పటిష్ఠం చేశారు. పాలకులను సమన్వయం చేశారు .ప్రజలందరినీ సంఘటితం చేశారు సంప్రదాయ విద్రోహుల చేత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్త్రీలను ఆదరించారు. లౌకిక ఆచరణలలో సర్వ హిత సంస్కరణలు చేశారు. లోకోపకార జ్ఞాన జనకమైన వారి బోధనలకు ఎంతో మంది శిష్యులు ఆకర్షితులయ్యారు .వారి దివ్యమంగళ స్వరూపం చూసి వారి సూక్తి సుధామాధురికి ముగ్ధులు అయినారు. ఆచార్య కైంకర్య మందు ప్రీతి కలిగి భగవద్భక్తి పరాయణులై నారు. శ్రీ రామానుజాచార్యుల బోధనలకు సాత్వికులు భగవద్ అభిముఖులై నారు. భగవత్ వ్యతిరిక్తులు కూడా ఆచార్య అభిముఖులైనారు శ్రీ రామానుజాచార్యుల శిష్యులు ఆచార్య ఆజ్ఞతో పూర్వాచార్యుల, ఆళ్వారుల దివ్య ప్రబంధ సారాన్ని ఆకళించుకుని ఎన్నో సాంప్రదాయ గ్రంథాలను రచించారు.వారు మేధస్సును మథించి గురు భక్తిని రంగరించి, భగవత్ శరణాగతి మార్గం తెలిపే ఉభయ వేదాంత సార వాంగ్మయాన్ని మనకందించారు.




శ్రీ రామానుజాచార్య చరిత్ర వైభవాన్ని పరిశీలిస్తే వారి ఔన్నత్యం మనకు కనిపిస్తుంది. “అందరు జనులకు ఉపకారం కలిగించేదే ఉత్తమ సంస్కృతి” అని చాటి చెప్పారు. ఆ సేతు హిమాచల పర్యంతం పర్యటించారు వారి దివ్య పార్థివదేహం ఉన్నంతవరకు జగత్ కళ్యాణానికి కృషిచేశారు. దేహానికి హద్దు కాలానికి పరిమితి ఉన్నా, వారి ఆకాంక్ష, ఆశంసనం మానవులు ఉజ్జీవించడమే. అందుకే

“సత్యం సత్యం పునః సత్యం యతి రాజో జగద్గురుః శ్రీ। స యేవ సర్వలోకానాం ఉద్ధర్తా నాస్తి సంశయః” అని వేనోళ్ళ స్తుతింప బడుతున్నారు.నాడు ప్రపన్న జనకూటస్థులుగా ప్రసిద్ధులైన శ్రీ నమ్మాళ్వార్‌లు లోకోద్ధరణకు జగదాచార్యులు అవతరించక ముందే వారి భవిష్యత్ ఆచార్య మూర్తిని దివ్య రూపురేఖలతో సంకల్ప సృష్టి చేసి తదనంతర ఆచార్యులకు అందించారు .నేడు జనులందరినీ ప్రపన్నులుగా ప్రవర్తింప చేసే మన ఆచార్యులు శ్రీనివాస స్వరూపులైన శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారు “సమతా మూర్తి సహస్రాబ్ది సమారోహం” పేరు తో భవిష్యత్ తరాల వారికోసం ఈ భవిష్యత్ ఆచార్యుల దివ్య మంగళ (సువర్ణ అర్చా, విరాట్ ఆచార్య) మూర్తులను లోకార్పణం గావించారు . ఇది మనందరి భాగ్యం! లోకోత్తరం! తదుపరి శ్రీ రామానుజకథా మాధురిని ఆస్వాదిస్తూ సేవించుకుందాము.

## సమతా మూర్తి ఆవిష్కరణ కై

# ఆర్థిక సమీకరణలు

సమత్వాన్ని కోరుకున్న ప్రతి ఒక్కరూ వారి ఒక్కొక్క పైసా జమ చేసి సమతా స్ఫూర్తితో సమతా మూర్తి ఆవిష్కారానికి సమర్పించారు. ఇది మనం తెలిపే మాట కాదు. సాక్షాత్ సంకల్ప స్వరూపాన్ని సాకారం చేసిన, సమతా మూర్తి సమారోహ నిర్మాణకర్త. శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారు తెలిపిన సత్యం!

సౌశీల్యం, సౌహార్దం, సౌలభ్యం, అను మూడు గుణాలు మూర్తీభవించిన శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారి మాటల్లోనే ఆ విశేషాలను తెలుసుకుందాం! ఆర్తి గొన్న భక్తుల యెడ సుదీర్ఘ పరిశీలనతో శ్రీస్వామి వారిలో సౌశీల్య మైన ఆదరణ కనిపిస్తుంది. వారి మాటల్లో అనుభవాలు రంగరించి ఆర్ద్రమైన సహృదయం కనిపిస్తుంది .శ్రీ స్వామి వారి మాటల్లో చేతల్లో కూడా దరికి చేరిన భక్తాగ్రేసరుల సేవానిరతి కి వశమైపోయిన సౌలభ్యం కనిపిస్తుంది.

సమతా మూర్తి సమారోహం వేదికగా సమతాకాంక్షులయిన మానవతా మూర్తులు ఎవరికైనా జగదాచార్యులైన సమతామూర్తి ఆవిష్కారానికి ఆర్థిక సమీకరణలు సమర్పించే అవకాశం లభించింది. ఆ విషయాన్ని శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారు భక్తగణం ముందే వెల్లడించారు. ఎవరైతే సమత్వాన్ని కాంక్షిస్తారో, సమాజంలో సమత్వాన్ని కోరుకుంటారో, భగవంతుని దృష్టిలో అందరూ సమానులే అని గౌరవిస్తారో వారి నుండే ఈ ధనం సమీకరించబడింది. జగదాచార్యులైన శ్రీ రామానుజాచార్యులకు బంగారు విగ్రహం కావాలని ఉండదు. ఆచార్యులచే ఉద్ధరింపబడిన సమాజం ఆ కృతజ్ఞతను ప్రకటించుకోవాలి. కృతజ్ఞతాభావం మానవునికి ఉండవలసిన స్వభావం. ఆచార్యుల యందు భక్తి, వారి ఉద్ధరణ వల్ల కృతజ్ఞతను ప్రకటించుకోవాలంటే అత్యంత విలువైనది బంగారం కనుక, ఆ బంగారాన్ని భక్తులు అర్పిస్తే ఆ మూర్తి వెలసింది. అని ఆచార్యుల యందు భక్తి భావాన్ని ప్రకటించుకునే పద్ధతిని శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారు సూచించారు. గొప్ప జీవన మార్గాన్ని ఇచ్చిన జగదా చార్యులు శాశ్వతంగా మన ముందు ఉండటానికి, మన క్షేమం కొరకు, సమాజంలో సమతా స్ఫూర్తి నెలకొల్పటానికి,శ్రీ రామానుజాచార్యుల మూర్తిని ఆవిష్కరించాలి. అందుకు మనం ఒక్క నెల ఆర్థిక ఆర్జనను సమర్పించుకోవాలి. అని శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్‌స్వామి వారు సూచించారు. ఎందరో భక్తులు సుదీర్ఘకాలంగా సేకరించిన ఆర్థిక బలంతో జగదా చార్యుల సమతామూర్తి ఆవిర్భవించింది. అతి సామాన్యులు మొదలుకొని అందరూ సమతామూర్తి యందు శ్రద్ధను వెలువరించారు. అందరూ భాగస్వాములయ్యారు.




ఇందుకు ఉదాహరణగా శ్రీశ్రీశ్రీ స్వామి వారు ఒక విశేష వృత్తాంతాన్ని వివరించారు. ఒక సామాన్య హరిజనుడు అర్ధరాత్రి మార్గమధ్యలో శ్రీశ్రీశ్రీ స్వామి వారిని సేవించుకొని భక్తితో తమ ఇంటికి రమ్మని ఆహ్వానించారట! వారు ఉన్న ప్రాంతం, రాత్రి సమయం, పరిస్థితులు ఏవి వెళ్ళటానికి అనుకూలంగా లేవు. అయినా ఆ భక్తికి, ఆర్తి కి ,విశ్వాసానికి చలించి, పాద సేవ కు అంగీకరించి వారి ఇంటికి వేంచేశారట! అంత రాత్రి వేళ అయినా వారి ఇంట్లో చేసిన ఏర్పాట్లు, మంగళ వాద్యాలు, గౌరవించు సాంప్రదాయం చూసి ఆ భక్తుని శ్రద్ధకు శ్రీ శ్రీశ్రీ స్వామి వారు పరవశించి మంగళాశాసనం చేశారు .ఆ భక్తుని సంవత్సర ఆదాయం లక్షా ఇరవై వేలు అయితే, ఒక్క నెల ఆదాయం పదివేలు గా విభజించి తన వంతు సేవగా పదివేల రూపాయలు సమర్పించారట! ఈ అద్భుత అనుభవాన్ని శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారు భక్తులందరి ముందు పంచుకున్నారు.

సమతా మూర్తి స్ఫూర్తి లో సంపన్నత భేదాలు ,కుల వివక్షత, సామాన్య ప్రత్యేక జనులు అను తేడాలు లేవు. భగవత్ కార్యంలో అందరూ భాగస్వాములే!'' పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతే'' అన్నట్లుగా భగవంతుని ఎదుట అందరూ సమానులే! భగవద్ రామానుజాచార్య సేవలోనూ, అనుగ్రహ ప్రాప్తి లో అందరూ సమానులే ఇదే సమతా స్ఫూర్తి.

# వందే గురుపరంపరాం

ఆకాశంలో సౌదామిని మెరవగానే సర్వం ద్యోతకం అవుతుంది. చిమ్మచీకటిలో గోరంత దీపం కొండంత వెలుగు అయినట్టుగా తోస్తుంది. అలా ప్రతి ఒక్కరి జీవితంలో ఒక ప్రేరణ ఉంటుంది. ఆ ప్రేరణ ఒక లక్ష్యం వైపు నడిపిస్తుంది. అది ఒక సన్నివేశం, సందర్భం కావచ్చు కార్య సాఫల్యం కావచ్చు ఒక వ్యక్తి కాని శ్రీసూక్తి కానీ కావచ్చు. అది ఏదైనా ఎవరైనా మనకు గురువు స్వరూపమే! లౌకిక ఉన్నతికి కారణమైన వారు గురువులే అయినప్పటికీ ఆధ్యాత్మిక జ్ఞాన ప్రకాశకులు మన ఉజ్జీవనానికి కారకులు. దైవీ భావ ప్రకర్షతో జీవించే గురువులు ప్రత్యక్ష దైవంగా కొలువ బడతారు. ఒక్కోసారి గురుస్థానంలో ఎందరైనా ఉండవచ్చును. ఆ స్ఫూర్తిని మరవకుండా జీవించే వారే ఉన్నతిని పొందగలుగుతారు. ఎందరో మహానుభావులు జగదుపకారికులుగా మారటానికి స్వల్పప్రేరణలే కారణాలయినాయి. ఎందరో ఆదర్శ పురుషుల జీవితాలు సమాజ ఉన్నతికి ప్రేరణగా నిలిచాయి. అగమ్యగోచరమైన మార్గాల్లో కరదీపికలు అయినాయి. భారతీయ సంస్కృతి జన్మ కారకులైన మాతృ పితృ ఆరాధనలతో పాటు జ్ఞాన జన్మ ప్రసాదించే గురువులుకూడా ఆరాధనీయులుగా నిర్దేశించింది " యస్య దేవే పరా భక్తిః యధా దేవే తథా గురౌ। తస్యై తే కథితాహ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః॥"అని చెప్పబడింది. అనగా భగవంతుని యందు ఎంత భక్తి ఉంటుందో గురువు యందు అంతే ఉండాలి. దృఢమైన విశ్వాసం భగవంతునిపైన గురువు పైన ఉన్న వారికే వేద జ్ఞాన సారం హృదయమందు ప్రకాశిస్తుంది. మంత్ర మందు దేవునియందు గురువునందు వైద్యుని యందు ఎవరికీ ఎట్టి భావం ఉంటే అటువంటి ఫలితమే కలుగుతుంది. అని పెద్దలు చెప్తారు. అందుకే "దేవ మేవా ఆచార్య ముపాసీతా"అని అంటారు.వివిధ సంప్రదాయాల కనుగుణంగా ఆధ్యాత్మికంగా ఆయా గురువులను పరంపరగా భావిస్తారు "మంత్ర మంత్రార్థదం గురుం" అని ఉజ్జీవించు మంత్రాన్ని మనకందించిన వారే గురువులు." అని చెప్తారు



"ఆచినోతి హి శాస్త్రార్థాన్ ఆచారే స్థాపయత్యపి
స్వయమాచరతే యస్మాత్ తస్మాదాచార్య ఉచ్యతే" అని ఆచార్య పదానికి నిర్వచనం చెప్పారు.

శాస్త్రవిహిత ధర్మాలను తాము ఆచరిస్తూ ఆచరింప చేసేవారే ఆచార్యులు. ప్రధానంగా శ్రీవైష్ణవ సంప్రదాయంలో ఆచార్యులకు మరింత ఉన్నత స్థానం ఉంది. ఆచార్యుల నాశ్రయించి పంచ సంస్కారాలను పొంది మంత్రోపదేశం పొందినపుడే నిజమైన ఉజ్జీవనానికి ప్రథమ సోపానం. అటువంటి ఆచార్యులు తాము కూడా పరంపరగా ఉపదేశితమయి ఉండడం మరింత విశేషమైనది. జగత్కాకారణుడైన పరంధాముని నుండి "లక్ష్మీ నాథ సమారంభాం" అని సాక్షాత్ భగవంతుని వద్దనుండి పరంపరగా పొందే ఉపదేశం ఎంతో ఉత్కృష్టమైనది. శ్రీవైష్ణవశ్రీ మనకిచ్చిన గొప్ప సాంప్రదాయ సంపద ఇది. అటువంటి శ్రీవైష్ణవశ్రీని భక్తి పౌష్కళ్యం గలిగిన ఆళ్వారుల సాధానామూలాలతో కలిపి సర్వ వేద సారంగా సంప్రదాయశ్రీని శ్రీవైష్ణవ గురు పరంపర మనకందించింది.

# భయం లేని జీవితం గడిపే మార్గం

**(గత సంచిక తరువాయి)**

ఎన్ని సంపదలు కలిగి ఉన్నా భయం అనేది ఉంటే రంధ్రం గలిగిన నీళ్ళ కుండ లాగా జీవితం అసంపూర్ణం అవుతుంది.సంకోచం లేని సన్మార్గ జీవన విధానం మన ను ధీశాలి గా చేస్తుంది. ఎంతటి కష్టాన్ని అయినా ఎదుర్కొనగలిగే నైతిక బలాన్ని చేకూరుస్తుంది అటువంటి కర్మానుష్టానం ఫల ప్రాప్తికి మార్గాన్ని సుగమం చేస్తుంది."అథ సః అభయం గతో భవతి" అప్పుడే అతడు అభయం పొందిన వాడు అవుతాడు. అటువంటి అభయాన్ని మనకు ఇచ్చే వాడు భగవంతుడు మాత్రమే!. తత్ జ్ఞానాన్ని మనకిచ్చే పుర ుష కారము ఆచార్యులు మాత్రమే! అని మన పెద్దల ఉపదేశము. అందుకు మనకు ఎన్నో ప్రమాణాలను ప్రవచన కారులు చెబుతారు. శ్రీరామ చరమ శ్లోకంలో

"సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే

అభయం సర్వభూతేభ్యో దదా మ్యేతద్ వ్రతం మమ ". ఎవరు శరణాగతి చేస్తారో వారు ఎవరైనా తాను అభయం కల్పిస్తున్నాను అని అదే తన దీక్ష గా సమస్త చేతనులకు అభయం అనుగ్రహించినట్లు గా శ్రీరామాయణం చెబుతున్నది.భర్తృహరి సుభాషితాల్లో భయం యొక్క స్థితి అద్భుతంగా వర్ణించాడు.

" భోగే రోగభయం కులేచ్యుతి భయం

విత్తే నృపాలాత్ భయం

మానే దైన్య భయం బలే రిపు భయం

రూపే జరాయాద్భయం శాస్త్రే వాద భయం

గుణే ఖిల భయం కాయే క్రుతాంతాత్ భయం సర్వం వస్తు భయాన్వితం భువి నృణాం వైరాగ్యమేవా2భయం "బీ

అనగా లోకంలో ప్రాకృతికమైన భోగం కులం విత్తం మానం బలం రూపం శాస్త్రజ్ఞానం గుణం శరీరం అన్నింటి యందు కూడా వినాశ భయం అనేది మనుషులకు ఉంటుంది కానీ ఒక్క వైరాగ్యంనందు మాత్రమే అభయం ఉంటుంది. అను జీవన సత్యాన్ని భర్తృహరి సుభాషితాల్లో

" శ్రీ సీతారామ పదాబ్జ న్యస్తస్య మమ మూర్ధనః ఛత్రాయితౌ ముదాస్తామి తత్కారావభయ ప్రదౌ"

శ్రీ సీతారామచంద్ర పాదపద్మాల యందు శిరస్సు ఉంచగానే అభయమిచ్చే రెండు చేతులు ఆ దాసుల శిరస్సులపై ఛత్రాల్లాగా భాసిస్తాయి అని ఈ శ్లోక భావం. "నవిద్యతే భయం యస్మాత్" అని ఎవరి వల్ల మనకు భయం కలగదో అతడు భగవంతుడు. శ్రీ రామాయణంలో సీతా పిరాట్టి కూడా దయామయియై అభయాన్ని కలిగించిన ఘట్టాలు ఎన్నో పెద్దలు ప్రవచిస్తారు. లంకా దహనం తర్వాత "శీతో భవ హనూమతః" అని సీతాదేవి దీవెన వల్ల హనుమంతుని వాలా గ్రం చల్లగా ఉందట." దత్త మస్య అభయం మయా"అని శ్రీరామచంద్రుని చేత అభయం పొందక ముందే సీతా దేవి అనుగ్రహంతో లంకానగరం మండుతున్న విభీషణుని ఇల్లు కూడా చెక్కుచెదర లేదట. అందుకే "హస్తాభ్యాం అభయప్రదాం" అని ఐశ్వర్య ప్రదాయిని గానే కాదు అంతకంటే ప్రధానమైన అభయప్రద గా అమ్మవారిని కొలుస్తాం. పూర్వాచార్యులు శ్రీయామునమునులు అమ్మవారిని స్తుతిస్తూ శ్రీకాంతా చతుశ్లోకి యందు " తామ్ త్వామ్ దాస ఇతి ప్రపన్న ఇతి చ స్తోష్యామి అహం నిర్భయః లోకేశ్వరి లోకనాథ దయితే దాంతే దయాంతే విదన్" అని స్తోత్రం చేస్తారు అనగా ఓ లోకైకేశ్వరి నాకు శక్తి లేకున్ననూ గొప్ప మహిమ గల నిన్ను లక్ష్మీదేవిని దాసుడను అగుట చేత నిర్భయుడు నై స్తోత్రం చేస్తున్నాను ఎందుకంటే నీ యొక్క దయ అనన్య శరణ లైన మా పైన ఎంత ఉంటుందో మాకు తెలుసు అని తన విశ్వాసాన్ని నిర్భయ తను ప్రకటించారు ఆచార్యులు. భగవదనుగ్రహం అనే కోటి కాంతుల వెలుతురు ముందు సంసార భయం అనే చీకటి రేణువులు పటాపంచలవుతాయి సదాచార నిష్ఠులై ఆచార్య భక్తి గలిగి భగవత్ శరణాగతి భావంతో జీవన గతిన సాగే వారిని విపత్తు భయాలు దరిచేరవు అని మన పెద్దల మాట.









# కమనీయం రమణీయం

కమనీయం రమణీయం 108 దివ్యదేశమూర్తుల కల్యాణం. సాకేతరాముని పర్యవేక్షణలో 108 దివ్యదేశమూర్తుల కల్యాణం సమతామూర్తి సన్నిధిలో జరిగింది. తొలుత జియ్యరు జియ్యరు వీరు అంటూ పాటతో రమణీయంగా సాగుతుండగా కల్యాణ ఏర్పాట్లు జరిగాయి. సహస్రాబ్ది ఉత్సవాల తరువాత వారం రోజులలోపు జరిగిన కల్యాణమహోత్సవానికి జంటనగర వాసులేకాకుండా వివిధ ప్రాంతాలకు చెందిన ఋత్విక్‌లు వచ్చి పాల్గొనడం విశేషం. విశేషించి అరుదైన కల్యాణోత్సవ ఘట్టాని తిలకించ డానికి వచ్చిన నేపాల్ నుంచి కన్యాకుమారి దాకా భక్త జనం ఇచ్చిన కానుకలు అమూల్యం. సాలగ్రామమాలలు, విలువైన వింజామరలు ఇత్యాదివి ఎన్నో ఉన్నాయి. ఈ ఉత్సవం జరుగుతున్నంత సేపూ సమతామూర్తి ఆవరణలోనే బయట ఉన్న భక్తులకు సైతం తలంబ్రాలు, ప్రసాదాలు అందిచే ఏర్పాట్లు చేశారు. అంతా క్రమశిక్షణతో దూరం నుంచైనా భక్తి శ్రద్ధలతో వీక్షించారు, ఈ కాల్యాణోత్సవం అనంతరం దివ్యదేశమూర్తుల ఆలయాల నిర్మాణానికి ఇతర కట్టడాలు శిల్పకళతో ఉట్టిపడటానికి తోడ్పడిన స్తపతి, తదితరును సత్కరించారు. జియ్యరు స్వామి వారు చెప్పే అమృత వచనాలకోసం భక్తులు శ్రద్ధగా వేచిఉండటం చూటముచ్చటగా ఉంది.









–జెట్ సౌజన్యంతో

## బాలవిజ్ఞానం

# ఆకలి తీర్చిన పుణ్యం

పురాణ కాలంలో కురుక్షేత్ర ప్రాంతంలో సక్థుప్రస్థుడు అను ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. ఆ బ్రాహ్మణుడు ఊంఛ వృత్తి చేసుకొని జీవించేవాడు. అతి పేద వాడు అయినప్పటికీ సక్థుప్రస్థుడు ధర్మాన్ని తప్పక పాటించేవాడు  అతని భార్య కొడుకు కోడలు నలుగురు కలిసి ఊంచ  వృత్తి చేస్తూ జీవించేవారు.

ఊంఛ వృత్తిని శిలోంఛవృత్తి అని ఊంఛన వృత్తి అని కూడా అంటారు. అంటే రైతులు ధాన్యాన్ని దులిపి తూర్పార పడుతున్నప్పుడు రాళ్ళపై నేలపై పడి ధాన్యాన్ని ఏరుకొని శుభ్రపరుచుకుని ఉపయోగించుకుంటారు. పూర్వం దీన్ని ఒక వృత్తిగా చెప్పే వారు. కొందరు తపస్సు చేసుకునే మునులు కూడా ఈ వృత్తితో ఆహారం సేకరించుకుని జీవించేవారు. నిరాడంబరంగా సమాజ క్షేమం కోరుతూ జీవించేవారు.

ఇదిలా ఉండగా ఒక సంవత్సరం వర్షాలు కురవ లేదు. కరువు వచ్చింది వీళ్లకు ధాన్యం దొరకటం కష్టం అయింది. దొరికిన కొంచెం ధాన్యాన్ని సరిపెట్టుకుని తింటున్నారు. ఒకరోజు దొరికిన కొద్ది ధాన్యాన్ని పేలాలు చేసుకుని పిండి కొట్టుకొని తినడానికి సిద్ధంగా అందరూ కూర్చున్నారు. అంతలో ఒక వృద్ధుడు వచ్చాడు "నాకు చాలా ఆకలిగా ఉంది ఏమైనా తినటానికి పెట్టండి" అని అడిగాడు. ముందుగా సక్థుప్రస్థుడు ఆ వృద్ధుని ఆదరంగా పిలిచి తన వద్ద ఉన్న పేలాల పిండిని పెట్టాడు. వృద్ధుడు అది తిని ఆకలి తీరలేదు అన్నాడు.సక్థుప్రస్థుని భార్య తన వంతు పిండిని పెట్టింది. అయినా "ఆకలి తీరలేదు"అన్న వృద్ధునికి అతని కొడుకు కోడలు కూడా తమ వంతు పిండిని పెట్టారు. ఆ వృద్ధుడు ఆకలి తీరింది అని వారిని దీవించాడు.

సక్థుప్రస్థుడు అతిథిని భగవంతుని రూపంగా తలచాడు. అతని భార్య తనభర్త ధర్మకార్యం పూర్తి చేయడానికి తనవంతు ఆహారాన్ని ఇచ్చింది. అతని కొడుకు తండ్రి మార్గంలో నడవడానికి తన ఆహారం ఇచ్చాడు. అతని కోడలు కూడా వచ్చిన అతిథిని శ్రీమన్నారాయణుడే అతిథి రూపంలో వచ్చాడు అని భావించి భక్తితో తనవంతు ఆహారాన్ని ఇచ్చింది.వృద్ధుని రూపంలో వచ్చింది ధర్మ పరిరక్షణకు డైన యమధర్మరాజు ఆయన వీరి ధర్మ నిరతికి ఎంతో సంతోషించాడు .సక్థుప్రస్థునికి అతని భార్యకు అంత మందు ఉత్తమగతులు వరంగా ఇచ్చాడు. కుమారునికి కోడలుకు ధర్మాచరణానికి వీలుగా సంపదలు ప్రసాదించి వెళ్ళాడు.


కొంత సేపు అయిన తర్వాత ఒక బిలం నుండి ఒక ముంగిస బయటకు వచ్చింది. అతిథి చేయి కడిగిన ప్రదేశంలో దొర్లింది. దాని ఒంటికి పేలపిండి అంటి శరీరం ఒకపక్క బంగారంలా మారిపోయి మెరవసాగింది. వెంటనే ముంగిస అత్యాశతో రెండవ వైపు కూడా దొర్లింది. కానీ శరీరం ఏమీ మారలేదు. ముంగిస విచారించింది. ఆ సమయంలోనే "ధర్మరాజు కూడా



అశ్వమేధయాగం చేసి అతిథులను ఆదరిస్తున్నాడు. అతను కూడా ఇంతటి ధర్మాత్ముడే" అని విన్నది ముంగిస. ధర్మరాజు అశ్వమేధ యాగం చేసే ప్రదేశానికి వచ్చింది. అక్కడ అతిథులు చేయి అడిగిన చోట దొర్లింది. కానీ ప్రయోజనం లేకపోయింది. వెంటనే ముంగిస గట్టిగా ఇలా పలికింది. "సక్థుప్రస్థుని పేలపిండి దానానికి ఏది సరికాదు" అని. విషయం తెలుసుకున్న ధర్మరాజు విచారించాడు. అక్కడి మునులు, ఋషులు అందరూ సక్థుప్రస్థుణ్ణి ప్రశంసించి, దీవించారు. అందుకే మనము ఎంత దానం చేశామన్నది కానీ అతిథులను ఎంత గొప్పగా ఆదరించామన్నది కాదు ముఖ్యం త్రికరణశుద్ధిగా దానం చేయడం, ధర్మాన్ని ఆచరించడం ప్రధానము.

# శ్రీసన్నిధి  పదకేళి

ఈ పదకేళిలో సరియైన సమాధానాలు వ్రాసి మాకు పంపడంతో పాటు ఈ పత్రిక లింకు మీ ఫేస్బుక్ లో షేర్ చేసి దానిని మాకు పంపిన, తరువాతి నెల సంచికలో మీ పేరుతో పాటు మీరు పంపే అడ్రసుకు (ఇండియాలో) ప్రత్యక్షంగా ఆ పత్రిక మీకు అందిస్తాము. 01 జనవరి 2022 సంచిక చదవండి సరియైన జవాబులు వ్రాయండి. ఫలితాలు: మే నెల సంచికలో.సరియైన జవాబులు మరియు మీ సోషల్ మీడియాలో పెట్టిన వివరాలు వెబ్ లో ఇచ్చిన వాట్సప్ ద్వారా పంపవలసినది. పత్రిక మీ ఇంటికే రావాలంటే వెబ్ లో వున్న అప్లికేషన్ తప్పనిసరి నింపండి.




## ఆధారాలు నిలువు:

1. తిరుప్పావై ప్రవచనాలతో తరింప చేసేవారిని .......(7).
2. ఆచార్యులు అనుగ్రహించేది .......శాసనం (6).
3. జీవనలక్ష్యం కలవారు ఎవరు చెప్పిననియమాలు అనుసరిస్తారు. (3)
4. శ్రీరామానుజ.................(ఒక శీర్షిక (5)
5. మన పత్రిక గౌరవ సంపాదకులలో జ్యోతిష్య పండితులు (9)
6. సమాతామూర్తి ఆవిష్కరణలో ఎన్ని కుండాలతో యజ్ఞం జరిగింది (అంకెల్లో)
7. ఆండాళ్ తల్లి అనుగ్రహించిన 30 రోజుల వ్రతం (4)
9. ధనుర్మాసంలో నివేదించే ప్రసాదం (3)
10. .................ఆకాంక్ష, ఆలోచన, ధ్యేయం (శీర్షిక (3)
11. పరమాత్మలో జగద్రక్షక పూర్వకమైన గుణం (5)
12. యజ్ఞంతో లోకహితం స్వామివారు చెప్పిన రాబోయే సంవత్సరం (4)
14. మాసంలలో శ్రేష్ఠమైన మాసం (కిందినుంచి పైకి (4)

## ఆధారాలు అడ్డం:

3. శ్రీసన్నిధానం ఆండాళ్ తల్లి.........(శీర్షిక (4)
8. గోదాదేవి రోజూ ఎవరిని నిద్రలేపుతుంది. (3)
13. ............దివ్యాజ్ఞా । వర్ధతాం అభివర్ధతాం ॥ (6)
15. తొడను చీల్చి ఆహారం ఇచ్చిన రాజు


**రచనలకు ఆహ్వానం**

సాహిత్యాభిమానులకు, పండితులకు మా శ్రీసన్నిధానం పత్రికలో ఆధ్యాత్మిక సంబంధ వ్యాసాలు, దేవాలయ విశేషాలు, కవితలు, పద్యాలు ఇతర రచనలు పంపించదలచిన వారు సంప్రదించండి.

Whatsup no 9502583323

**త్వరలో రాబోయే శీర్షికలు**







ఆధ్యాత్మిక జ్యోతిష్య ధార్మిక సంబంధిత సందేహాలకు ప్రముఖుల సమాధానాలు


Marketing Editor Samudrala Raghuramacharya